కులకచర్ల, డిసెంబర్ 30 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ సమీపంలోని పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామిని పరిగి సివిల్ కోర్టు జడ్జి శిల్పాదంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని దేవాలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు, పూజారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ పూజారులు పాండుశర్మ, దశరథం, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధరణి అభ్యంతరాలను తొలగించండి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించిన బెన్నూరు గ్రామ రైతులు

యాలాల, డిసెంబర్ 30: లోకాయుక్త కోర్టు ఇచ్చిన తీర్పునకనుగుణంగా ధరణి అభ్యంతరాలను తొలగించి తమకు న్యాయం చేయాలని బెన్నూరు గ్రామ రైతులు సోమవారం తాండూరు పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం గ్రామ సీనియర్ నాయకులు, రైతు గురురాజ్ జోషి మాట్లాడుతూ... తమ గ్రామానికి చెందిన సుమారు 200 సర్వే నంబర్ల భూములపై 1977లో శరణ్ భూపాల్‌రెడ్డి కోర్టునాశ్రయించి తెచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌పై తనతో పాటు 200 మంది రైతులు నేటి వరకు అలుపెరుగని పోరాటం చేస్తున్నామన్నారు. ఎంఆర్‌వోను సంప్రదించినా కోర్టు కేసు ఉన్నందున ఏమీ చేయలేమని నిస్సహాయత వ్యక్తం చేశారన్నారు. 2022లో లోకాయుక్త కోర్టును న్యాయం కోసం ఆశ్రయించమన్నారు. లోకాయుక్త కోర్టులో న్యాయం జరిగిందన్నారు. కోర్టు తీర్పు ఆధారంగా ధరణి యందు గల అభ్యంతరాలను తొలగించి న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శరణ్ భూపాల్, అంజిల్ రెడ్డి, మల్‌రెడ్డి ఉన్నారు.

సాంఘిక శాస్త్రంలో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పూడూరు, డిసెంబర్ 30: మండల కేంద్రంలో సోమవారం మండల స్థాయి సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో కంకల్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.ప్రకాశ్ ప్రథమ స్థానం గెలుపొందగా, ద్వితీయ స్థానం సారాబేగం, తృతీయ స్థానం అక్షర చన్గోముల్ హై స్కూల్‌కు చెందిన విద్యార్థినులు గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డి.హనుమంత్‌రెడ్డి, పుష్ప మాట్లాడుతూ గైడ్ ఉపాధ్యాయులైన ఎం.కిశోర్‌బాబు, వెంకటయ్య, చంద్రమోహన్, మల్లేశ్వరిలతో పాటు పోటి పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కళాబృంద ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ గిరి

యాలాల, డిసెంబర్ 30: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గిరి సూచించారు. సోమవారం మండల పరిధిలోని ముద్దాయిపేట గ్రామంలో కళాబృందంతో ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఎస్ఐ మాట్లాడుతూ... సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దని, బ్యాంక్ అకౌంట్‌లకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకుంటూ, ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయొద్దని, పబ్లిక్ ప్రదేశాలలో వైఫై ఉపయోగిస్తూ బ్యాంక్ లావాదేవీలు చేయవద్దని వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు ఉంచొద్దని, ఫేక్ లాటరీలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీంలను నమ్మొద్దని హితవు పలికారు. ఇంటివద్దనే ఉండి డబ్బులు పెట్టుబడిగా పెడితే అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే నమ్మొద్దని, ఇలాంటి మోసాలకు గురైన వ్యక్తులు 1930 హెల్ప్‌లైన్‌కు, సైబర్‌మిత్ర 9121211100 నెంబర్‌కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇంట్లో నగదు, బంగారం లాంటి విలువైన వస్తువులు పెట్టి తాళం కనిపించేట్లు వేసి ఊర్లకు వెళ్లకూడదని, పోలీస్ స్టేషన్‌లో చెప్పి ఎల్‌హెచ్ ఎంఎస్ సిస్టమ్‌ను అమర్చుకోవాలని వివరించారు.

మండల మాల సంఘ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

యాలాల, డిసెంబర్30: తాండూరు పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ ఆధ్వర్యంలో సోమవారం మండల మాల సంఘ జేఏసీ నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా నరేశ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్య దర్శిలుగా నర్సింహులు, అశోక్, కార్యదర్శిలుగా కృష్ణ, వెంకటయ్య, ఇతర సలహాదారులుగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నరేశ్‌మాట్లాడుతూ ఎల్లవేళలా మాలలకు అందుమాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దోమ,డిసెంబర్ 30: దోమ మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన కురువ మెకానిక్ అంజిలయ్య భార్య కురువ యాదమ్మ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయకుడు జగత్‌రెడ్డి మానవత్వంతో ఆమె అంత్యక్రియలకు గాను ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కురువ సంఘం అధ్యక్షుడు అగ్ని కుమార్, దాసరిగుట్ట మల్లేశ్, బీఆర్ఎస్ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు

- గ్రామగ్రామాన పౌరహక్కులపై అవగాహన
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బషీరాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శంకర్

పూడూరు మండల కేంద్రంలో ..

బషీరాబాద్, డిసెంబర్ 30 : సమాజంలో పౌరులందరూ సమానమని బషీరాబాద్ ఎస్సై పి. శంకర్ అన్నారు. మండల పరిధిలోని క్యాధిగిర గ్రామంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవ సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎదుటి వ్యక్తి హేళన చేస్తే, కించపరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఒకరి హక్కులకు ఇంకొకరు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయన్నారు.
ప్రజల హక్కుల గురించి చట్టంలో పొందుపర్చారని, ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవించేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పం చాయతీ ప్రత్యేకాధికారి రాధిక, గ్రామ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

మర్పల్లి: ప్రతి ఒక్కరూ తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలని వార్డెన్ తుల్జారామ్ గౌడ్, ఆర్ఐ మాధవరెడ్డి అన్నారు.. సోమవారం మండలంలోని పంచలింగాల్ గ్రామంలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయరాదని, చేస్తే వచ్చే పరిస్థితులను వివరించారు.. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి కిరణ్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, సంతోశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.
పూడూరు: ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో ధూషించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చన్గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పూడూరు మండల కేంద్రంలో పౌరహక్కులపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రావ్య, వార్డెన్, మైసుద్దీన్, సుభాష్, నిరంజన్, పెంటయ్య పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఖాళీ కుర్చీలే..

వికారాబాద్, డిసెంబర్ 30 : మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నలుగురు మండల అధికారులు తప్పా వివిధ శాఖల అధికారులు ఎవరూ హాజరు కాలేదు. అలాగే ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ప్రజావాణికి ఆయా శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే ప్రజల సమస్యలు ఎలా పరి ష్కారం అవుతాయని వారు ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీవో దయానంద్, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం లక్ష్మయ్య, ఎంఈవో బాబుసింగ్ పాల్గొన్నారు.

వికారాబాద్, డిసెంబర్ 30 : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శులు వెంకటేశ్, న్యాయవాదులు గోపాలరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి బస్వారాజ్ పటేల్, కమాల్ రెడ్డి సంపూర్ణనంద్, యాదవ్ రెడ్డి మాధవ్‌రెడ్డి , రాంచందర్ రావు, నాగరాజు, సంతోష్ కుమార్, మహమ్మద్‌రఫీ , శుక్లవర్ధన్ రెడ్డి, శంకరయ్య, రాజు, తులిసీరామ్, శ్రీకాంత్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణకు
రూ. కోటి 50లక్షలు మంజూరు

అంబేద్కర్ కూడలి విస్తరణ నమూనా చిత్రాన్ని చూపుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, డిసెంబర్ 30: పట్టణంలోని అంబేద్కర్ కూడలి ఇరుకుగా ఉండటం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, దాంతో పాటు కూడలిని అందంగా తీర్చిదిద్దుకుంటే పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ సంఘాలతో పాటు మున్సిపల్, పోలీసు అధికారులు, కౌన్సిలర్లలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కూడలి అభివృద్ధికి రూ. కోటి 50లక్షలు నిధులు కేటాయించరని, కూడలి విస్తరణకు పట్టణ వాసులు సహకరించాలని కోరారు. అంబేద్కర్ కూడలిలో ప్రస్తుతం అంబేద్కర్ విగ్రహం ఉందని, విస్తరణలో తొలగించే అవకాశం ఉన్నందున అభిప్రాయసేకరణకు గాను సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ కూడలి విస్తరణకు ఎటువంటి అభ్యంతరాలు ఉండవని, అయితే విస్తరణ తరువాత విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని కోరారు. అదేవిధంగా అంబేద్కర్ విజ్ఞాన భవన్ నిర్మాణం, స్మశాన వాటిక వంటి వాటి ఏర్పాటుకు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

98 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, డిసెంబర్ 30: నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని 98 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు పట్టణంలోని కడా కార్యాలయంలో సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఎంపీడీవో ఉషశ్రీ, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం..కేసు నమోదు

తాండూరు రూరల్, డిసెంబర్ 30 : ఏడాది వయసు బాలుడు అదృశ్యమైన సంఘటన కరణ్ కోట పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం ప్రకారం..తాండూరు మండలం, గౌతాపూర్ గ్రామానికి, కర్ణాటక రాష్ట్రం చితాపూర్‌కు చెందిన భాషా, భార్య గోర్బీ, వజీర్‌బీ వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. భర్త గ్యాస్, మిక్సీలు రిపేరు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న చెట్టు ముందు రాత్రి కుటుంబమంతా పడుకున్నారు. సోమవారం ఉదయం నిద్రలేచి చూసే వరకు తల్లి గోర్బి పక్కలో కొడుకు హుస్సేన్ కనిపించలేదు. చుట్టూ పక్కల వెతికినా ఆచుకీ కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రోడ్డు వారగా ఉన్న సీసీ ఫుటేజీలను కూడా పోలీసులు పరిశీలించారు. అయినా బాలుడి ఆచూకీ లభించలేదు. బాలుడు తండ్రి భాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

వికారాబాద్/ దౌల్తాబాద్ డిసెంబర్ 30 : అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు ఎస్సీ నారాయణ రెడ్డి సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 118/2022, ఫోక్సో యాక్ట్ కింద నమోదైన కేసులో నిందితుడు దాసరి గోవింద్‌కు సోమవారం వికారాబాద్ అడిషనల్ సెషన్స్ జడ్జి సీహెచ్. చంద్ర కిషోర్ జీవిత ఖైదుతో పాటు రూ. 1.50లక్షల జరిమానాను విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించకపోతే ఆరు నెలల పాటు సాధారణ జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

పూడూరు,డిసెంబర్ 30: చీటింగ్ కేసులో ఇద్దరి వ్యక్తులకు సంవత్సరం జైలు శిక్ష, రూ. 6వేల జరిమానాను పరిగి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వప్న విధించినట్లు చన్గోముల్ ఎస్సై మదుసూధన్‌రెడ్డి తెలిపారు. పూడూరు మండలం చన్గోముల్ పోలీస్ స్టేషన్‌లోని క్రైమ్ నెంబర్ 74/2012 u/s 420,467 ipc కింద కేసు నమోదైనట్లు తెలిపారు. చన్గోముల్ గ్రామానికి చెందిన ఎ-1 ఎం.రాంచం ద్రారెడ్డి, ఎ-2- సత్తర్‌ఖాన్‌లపై అంగడిచిట్టంపల్లి గ్రామానికి చెందిన ఖాజా మునిరోద్దీన్ (శకిల్) ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో చీటింగ్ కేసు నమోదు అయినట్లు తెలిపారు. కేసును ఎస్సీ నారాయణరెడ్డి పర్యవేక్షణలో పరిగి డీఎస్పీ, శ్రీనివాస్,సిఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై మదుసూధన్‌రెడ్డి, కోర్టు ఇన్‌చార్జి ఆఫీసర్ వీరన్న, కోర్టు కానిస్టేబుల్ శివకుమార్‌లు సాక్షులకు బ్రీఫ్ చేసి కోర్టులో హాజరుపరిచారు. పరిగి కోర్టు ఏపీపీ యాదయ్య కేసు వాదించి నిందితులకు శిక్ష పడేలా చేసినట్లు ఎస్సై మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

పోటీపరీక్షలకు సాంఘిక శాస్త్రం ఉపయోగం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

పెద్దేముల్, డిసెంబర్ 30: సాంఘిక శాస్త్రం పోటీపరీక్షలకు ఎంతో ఉపయోగకరం అని పెద్దేముల్ ఎంఈవో నర్సింగ్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మండల సాంఘిక శాస్త్ర ట్యాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి నర్సంగ్‌రావ్ మాట్లాడుతూ...భవిష్యత్‌లో సివిల్స్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటె విద్యార్థులు సాంఘిక శాస్త్రంలో ప్రావీణ్యం సాధించడం ఎంతో అవసరమన్నారు. సోషల్ ఫోరం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జి. బస్వరాజ్ మాట్లాడుతూ...విద్యార్థులకు సాంఘీక శాస్త్రంలో వివిధ రకాల పోటీలు నిర్వహించడంలో సోషల్ ఫోరం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డి, సాంఘీక ఉపాధ్యాయుడు అంజయ్య, సంధ్యా రాణి, అనురాధ, విజయ్ కుమార్, అశోక్ , మురళి, బుజ్జమ్మ పాల్గొన్నారు



కులకచర్ల, డిసెంబర్ 30 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మండల సోషల్ ఫో రం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, అజ్మత్‌ల ఆధ్వర్యంలో సాంఘీక శాస్త్ర ట్యాలెంట్ పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కులకచర్ల ఎంఈవో అబీబ్‌హైమద్ హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు మోహన్, భాస్కర్, వెంకటయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్, డిసెంబర్ 30 : వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఓ వ్యక్తి సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతని వద్ద నుంచి ఓ దొంగ సెల్‌ఫోన్ లాక్కొని పరిగెత్తాడు. బాధితుడు సెల్‌ఫోన్‌ను దొంగ ఎత్తు కెళ్తున్నాడని అరవడంతో స్థానికంగా ఉన్న ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే దొంగను పట్టుకొని వికారాబాద్ స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించారు.

శిలాఫలకం ధ్వంసం

పరిగి, డిసెంబర్ 30: పరిగి పట్టణ శివారులోని తుంకులగడ్డలో ఈనెల 15వ తేదీన బంజారాభవన్ నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ. 2కోట్లతో బంజారా భవన్ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాటుచేసిన ఈ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా గిరిజన సంఘాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

CHANGE OF NAME

★I, VEMU MUTHAMMA, W/o. Late Guta Venkateshwarlu, H.No. 2-52/1, Vanasthali Hills, Tatti Khana, Near Unicent School, Tatti Annaram, Abdullapurmet, P.O: GSI (Sr) Bandlaguda, R.R.Dist., T.S-500 068. Changed My Name as GUTA LAXMAMMA, W/o. Late Guta Venkateshwarlu.
NT-337769

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962